క్లుప్తంగా

రీ సర్వేను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జడేరులో రీ సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌ఐ జిలానీ

గంగవరం : భూముల రీ సర్వేను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జిలానీ బాషా తెలిపారు. మంగళవారం జడేరు గ్రామంలో నిర్వహించిన రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఉమ్మడి, వారసత్వ భూములు ఉంటే మ్యుటేషన్స్ చేయించుకోవాలని రైతులను సూచించారు. వీఆర్వో వెంకన్నదొర, సర్వేయర్లు లీలాకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మాధవి

అరకులోయ రూరల్: ఒత్తిడికి గురికాకుండా ప్రణాళిక ప్రకారం చదివితే టెన్త్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని భీమిలిలోని జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కళాశాల అధ్యాపకురాలు మాధవి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆమె టెన్త్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధైర్య పడకుండా పరీక్షలకు సిద్ధంకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శెట్టి సుందరరావు, ఉపాధ్యాయులు గెన్ను, సూరిబాబు,మీన,రోజారాణి,అప్పాలరాజు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

37 మందికి వైద్యసేవలు



వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని అమ్మిరేఖలలో మంగళవారం నిర్వహించి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున 37 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 108 ఉద్యోగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పెరిగిన పాలిథిన్ కవర్ల వినియోగం



విక్రయించేందుకు పాలిథిన్ కవర్లలో కట్టిన ఉల్లిపాయలు

పెదబయలు: మండలంలో కొంతకాలం పాటు తగ్గిన పాలిథిన్ కవర్ల వినియోగం ఇటీవల మళ్లీ పెరిగింది. పర్యావరణానికి హాని కలిగించే వీటి వినియోగాన్ని నిషేధించారు. ఈ మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో కొద్ది రోజుల పాటు వీటివాడకం తగ్గింది. తరువాత అధికారుల తనిఖీలు తగ్గడంతో మళ్లీ వినియోగం పెరిగింది. కూరగాయలు,కిరాణా దుకాణాల్లో అధికంగా వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి పాలిథిన్ వినియోగంపై నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్ తప్పనిసరి



కొల్లాపుట్టులో గొర్రెకు టీకా వేస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా పీపీఆర్ టీకా వేయించాలని పశు వైద్యాధికారి గౌతమ్ తెలిపారు. కొల్లాపుట్టు పంచాయతీ మొనిగుడ, బిట్రగండ, డెక్కపారు, చంపగుడ, బుసిపుట్టు తదితర గ్రామాల్లో 412 గొర్రెలు, 522 మేకలకు మంగళవారం పీపీఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ గొర్రెలు,మేకలకు ఎటువంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు ఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. సర్పంచ్ తౌడమ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు.

తొలగిన చీకట్లు

- వీధి దీపాలను బాగుచేసిన సిబ్బంది
- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



మరమ్మతులు చేస్తున్న జెన్‌కో ఉద్యోగి

మోతుగూడెం: ఆ గ్రామాల చీకటి కష్టాలు ఎట్టకేలకు తొలగాయి. మోతుగూడెం నుంచి పొల్లూరు వరకు సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న వీధి లైట్లకు ఏపీ జెన్‌కో డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది మరమ్మతులు చేశారు. ప్రాజెక్టు కట్టిన తొలినాళ్లలో ఏర్పాటు చేసిన ఈ వీధి దీపాలు నిర్వహణ లోపం వల్ల పాడైపోయాయి. దీంతో ఏపీ జెన్‌కో సిబ్బంది, గ్రామస్తులు చిమ్మచీకట్లో ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మోతుగూడెం నుంచి పొల్లూరు పవర్ ప్లాంట్ వరకు గల వీధిదీపాలకు మరమ్మతులు చేయడంతో స్థానికుల కష్టాలు తొలగాయి. మోతుగూడెం ఏపీ జెన్‌కో కాలనీలో కూడా వీధి దీపాలకు మరమ్మతులు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వీధి దీపాలు మరమ్మతులకు ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించిన ఏపీ జెన్‌కో అధికారులు సీఈ బి.శ్రీధర్, ఎస్ఈ వెంకటేశ్వరరావు, డీఈ భీమారావు,బాలకృష్ణ, ఈఈ బాబురావులకు సర్పంచ్ ఆకేటి సీత,ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.



కాంతులు విరజిమ్ముతున్న వీధి దీపం

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించాలి

చింతపల్లి: క్రమశిక్షణ, ప్రణాళికతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఎంఈవో వనపల ప్రసాద్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 40 వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ఇంటర్మీడియెట్ తొలి మెట్టు అని అన్నారు. అనంతరం గత ఏడాది కళాశాలలో 99 శాతం మార్కులు సాధించిన యు.రమేష్ ,కె.వెంకటరావులకు నగదు బహుమతి అందజేశారు. ఏపీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.రామేశ్వరం, ఏటీడబ్లూవో జయ నాగలక్ష్మి, పలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎంఈవో ప్రసాద్

కూనవరం ఆస్పత్రిలో మరో ముగ్గురికి శస్త్రచికిత్స

కూనవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రి (కోతులగుట్ట)లో మంగళవారం మరో ముగ్గురికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఈ ఆస్పత్రిలో ఇటీవల శస్త్ర చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఇంతకు ముందు ఐదు ఆపరేషన్లు నిర్వహించగా, తాజాగా మూడు ఆపరేషన్లను జనరల్ సర్జన్ డాక్టర్ జె.భాస్కర్, ఎనస్థీషియా హర్షవర్ధన్‌ల ఆధ్వర్యం విజయవంతంగా నిర్వహించారు.



ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యులు

మాతృభాషను పరిరక్షించుకోవాలి



బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

చింతపల్లిరూరల్: మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెచ్ఎం చిట్టినాయుడు తెలిపారు. చౌడుపల్లి ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోలేని విద్యార్థి మంచి విషయాలను నేర్చుకోవడంలో విఫలమవుతాడని చెప్పారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగన్నదొర, సత్యనారాయణ,కె.శ్యామలకుమారి,రూపవాణి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిర్మూలనకు ప్రత్యేక టీమ్‌లు

నర్సీపట్నం: కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనకు కమిటీలు సమర్థవంతంగా పని చేయాలని టౌన్ సీఐ ఎస్.గణేష్ అన్నారు. టౌన్ పోలీసు స్టేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలోని 30 కళాశాలల్లో యాంటీర్యాగింగ్ నిర్మూలనకు ఒక్కొక్క కాలేజీకి సీనియర్ ఫ్యాకల్టీ, సత్ప్రవర్తన కలిగిన ఇద్దరు విద్యార్థులతో కమిటీలను వేశామన్నారు. ప్రతి కాలేజీలో పోలీసు కంప్లైట్ బాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా ర్యాగింగ్ సమస్యను ఎదుర్కొంటే కాగితంపై రాసి అందులో వేస్తే పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదుదారు వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ మధ్యకాలంలో కొంత మంది విద్యార్థులు గంజాయి రవాణాతోపాటు సేవిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్తే జీవితాలు నాశమవుతాయన్నారు. టౌన్ ఎస్సై గోవిందరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గణేష్

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు : సీఐ

చోడవరం రూరల్: కళాశాలల్లో తమ జూనియర్ విద్యార్థులను, సహ విద్యార్థులను ర్యాగింగ్ చేసినట్టయితే కఠిన చర్యలు తప్పవని సీఐ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులతో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా చోడవరం స్టేషన్ పరిధిలోని 16 కళాశాలల్లో సీనియర్ ఫ్యాకల్టీ, మంచి నడవడిక కలిగిన ఇద్దరు విద్యార్థులు, ఒక పోలీసు ఆఫీసర్‌తో యాంటీ ర్యాగింగ్ కమిటీలను నియమించారు. చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో ఉన్నత శిఖరాలు

అచ్యుతాపురం(అనకాపల్లి): పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సెట్విస్ జిల్లా మేనేజర్ బి.నూకరాజు సూచించారు. అచ్యుతాపురం మండలంలోని కైట్స్ కళాశాలలో మంగళవారం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నూకరాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉత్పన్నమయ్యే ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, అవకాశాలను బట్టి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అన్నారు. రాంబిల్లి ఎన్‌జీవో నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.అప్పలనాయుడు, ఎ. సన్యాసిరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అసాంఘిక పనులకు దూరంగా ఉండండి

పాయకరావుపేట : స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో పోలీసు శాఖ ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు, ఉపయోగించడంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ పి.అప్పలరాజు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యంగా ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు, సైబర్ క్రైమ్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తాము కళాశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో ఫిర్యాదులు అందించినట్టయితే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కళాశాలలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్ఐ బి.జోగారావు, మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, తద్వారా వారు ఎదుర్కొనే చట్టపరమైన చర్యలు గూర్చి విద్యార్థులకు వివరించారు. అటువంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు, ఏఎస్ఐ జె.గోవిందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పలరాజు

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

రాంబిల్లి : లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ దీనబంధు హెచ్చరించారు. లాలంకోడూరు జూనియర్ కళాశాల, రాంబిల్లి కేజీబీవీ పాఠశాలలో మంగళవారం ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి కళాశాల , పాఠశాలల్లో ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వీటిలో ఫిర్యాదుల పత్రాలు వుంచాలన్నారు. విలేజ్ పోలీసు, ఫ్యాకల్టీ, స్టూడెంట్, కానిస్టేబుల్‌తో ప్రతి కళాశాల, పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకోవాలని ఎస్ఐ సూచించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ దీనబంధు

హరిపాలెంలో రెడ్ బుక్ డే

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో రెడ్ బుక్ డే దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుదాం.. సమాజాన్ని మార్చుదాం అని నినదించారు. జె.వి.వి జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారావు శ్రీ శ్రీ రచించిన పద్యాలను చదివి వినిపించారు. సమాజంలో మార్పు కోసం శ్రమజీవులు, కష్టజీవులు కలసిరావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమునాయుడు, జె.వి.వి.కార్యదర్శి రామ్‌కుమార్, రవి కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ విజయమే లక్ష్యం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ కోరారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. నియోజకవర్గంలోని ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు,నాయకులు సీతంరాజు విజయమేలక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు,వైస్ ఎంపీపీ రాజుబాబు,మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, గంపరాయి సూరయ్య,సర్పంచ్ లోయిదాస్,మాజీ సర్పంచులు వంతాల కామేశ్వరరావు,పాంగి సింహాచలం, నంతరావు, కొండలరావు,యువజన నాయకులు అజయ్‌కుమార్,జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించాలి

దుంబ్రిగుడ: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ దుంబ్రిగుడ, పోతంగి, అంత్రిగుడ, బల్లుగుడ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు శాంతి, పోతంగి ఉప సర్పంచ్ జగ్గునాయుడు,గుంటసీమ సర్పంచ్ నాగేశ్వరరావు,సీనియర్ నాయకుడు బాక సింహాచలం, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్‌ను గెలిపించండి

జి.మాడుగుల: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి మాధవ్‌ను గెలిపించాలని కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు కోరారు. జి.మాడుగులలో మంగళవారం ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సలుగు సతీష్‌పడాల్, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ కురుసా రాజారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లకే బాలయ్యదొర, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందోలి ఉమామహేష్, జిల్లా నాయకుడు వి. సుబ్బారావు, మండల ఉపాధ్యక్షుడు బి.నూకరాజు, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.



ముంచంగిపుట్టు, పెదబయలు నాయకులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



దుంబ్రిగుడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రవిబాబుకు అభినందనల వెల్లువ



రవిబాబుకు అభినందనలు తెలుపుతున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, నాయకులు



రవిబాబును కలిసిన వైఎస్సార్‌సీపీ దుంబ్రిగుడ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, నాయకులు



రవిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జీకే వీధి నాయకులు

సాక్షి,పాడేరు/జీకే వీధి: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ కుంభా రవిబాబును సీఎం జగన్ మోహన్‌రెడ్డి సిఫార్సు చేయడంపై పాడేరు,అరకులోయ నియోజకవర్గాల్లోని వైఎస్సార్‌సీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావులు ఫోన్‌లో ఆయనకు అభినందనలు తెలిపారు. విశాఖకు భారీగా తరలివెళ్లిన నేతలు వేర్వేరుగా రవిబాబును కలిసి అభినందనలు తెలిపారు.రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ ఎంపీపీ ఎస్.వి.వి.రమణమూర్తి, మాజీ మండల అధ్యక్షుడు కూడా సింహాచలం,వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు డి.పి.రాంబాబు, అరకులోయ నియోజకవర్గంలోని మాజీ సర్పంచ్ పాంగి చిన్నారావు,మాజీ ఎంపీటీసీలు సుందర్రావు,సమరెడ్డి భాస్కరరావు,మాజీ ఉప సర్పంచ్ విజయ్‌కుమార్, జీకే వీధి మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి వసుపరి ప్రసాద్ తదితరులు డాక్టర్ రవిబాబును కలిసి అభినందనలు తెలిపారు.

దుంబ్రిగుడ: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ కుంభా రవిబాబును సీఎం సిఫార్సు చేయడంతో మంగళవారం వైఎస్సార్‌సీపీ దుంబ్రిగుడ మండల అధ్యక్షుడు శెట్టి గోపాల్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొములునాయుడు ఆధ్వర్యంలో పలువురు నాయకులు విశాఖపట్నంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సందడిగా వార్షిక క్రీడా వేడుకలు



విజేతలను ప్రశంసా పత్రాలతో అభినందిస్తున్న అతిథులు

పాయకరావుపేట : శ్రీ చైతన్య పాఠశాలలో వార్షిక క్రీడా వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ పి.అప్పలరాజు, రిటైర్డ్ పీడీ, రాష్ట్ర ఆత్యాపాత్యా ప్రెసిడెంట్ కె.జాబేజ్ విచ్చేశారు. క్రీడల వల్ల పిల్లలలో శారీరక దారుఢ్యం, క్రీడా స్ఫూర్తితో పాటు మానసిక ఉల్లాసం కూడా పెంపొందుతుందని వారు పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.మాణిక్యాలరావు మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి అలవడతాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అలరించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ఎం.సురేష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్లబళ్ల పరుగు పందెం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు



బుచ్చెయ్యపేటలో ఉరకలేస్తున్న ఎద్లు

బుచ్చెయ్యపేట: వడ్డాది, బుచ్చెయ్యపేటలో తీర్థాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుచ్చెయ్యపేటలో ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గులు, క్విజ్, కబడ్డీ, ఎడ్ల పరుగు పందెం ఆకట్టుకున్నాయి. ప్రధానంగా ఎడ్లబళ్ల పరుగు పందెం హోరాహోరీగా సాగింది. ఆయా పోటీల్లో విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు బహుమతులను ప్రదానం చేశారు. వడ్డాదిలో మూడు రోజుల పాటు జరిగే మోదకొండమ్మ తీర్థం సందర్భంగా తొలిరోజు అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాల భక్తులు తీర్థంలో పాల్గొన్నారు. రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

27 వరకు ఇంటర్ ఓపెన్ స్కూల్ ప్రవేశం

రోలుగుంట: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు ఇంటర్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సహదేవుడు మంగళవారం తెలిపారు. గతంలో పదో తరగతి ఉత్తీర్ణత చెందిన వారికి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువు మధ్యలో ఆపేసిన వారికి ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. వచ్చే నెల 1 నుంచి 7వ తేదీ వరకు ఫీజులు ఆన్‌లైన్లో గాని, నేరుగా తమ కళాశాలలో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9985593881 సంప్రదించాలని సూచించారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎస్.రాయవరం : గుడివాడ కలియుగ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో టీటీడీ దేవస్థానం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ స్వామికి అయిదేళ్లుగా వార్షిక కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేదపండితులు సమక్షంలో అంగరంగ వైభవంగా స్వామి కల్యాణం నిర్వహించారు. పురవీధుల్లో ఉత్సవ మూర్తులు ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు.